సూర్యోదయం

తెల్లవారింది. ముఖ ప్రక్షాళనం చేసుకుందామని నీళ్ళ చెంబుతో అరుగుమీదకు వచ్చిన రంగయ్యగారు, కూర్చుని తూర్పు దెస చూశాడు. కొంచం ఆగి, ఆశ్చర్యంతో కళ్ళకు చేయి అడ్డుపెట్టుకుని, తీక్షణంగా చూశాడు. ఆయన కళ్ళు ఆనందంతో మెరిశాయి. సూర్యుడు ! అవును సూర్యుడే.

సంతోషంతో గట్టిగా కేక వేద్దామనిపించింది. ఆ క్షణాన్నే యింట్లోకి పోయి యీ విషయాన్ని, యీ శుభ వార్తని ఎలుగెత్తి చాటుదామనుకున్నాడు. కాని ప్రయత్నం మీద రెండు ప్రయత్నాలూ మానుకుని ఉత్సాహంతో చూడసాగాడు.

క్రమక్రమంగా సూర్యుడు దగ్గరకు వస్తున్నాడు. మరీ సమీపానికి వచ్చేసరికి రంగయ్యగారు ఉత్సాహం ఆపుకోలేక లేచి నిలబడ్డాడు.

"మామయ్యా !"

"సూర్యుడూ"

సూర్యుడి గొంతువిని మహదానందంలో మునిగిపోయిన రంగయ్యగారు, పేరుపెట్టి పిలిచి నఖశిఖ పర్యంతం పరిశీలించ

సాగాడు. ఆ గొంతు! నాలుగు సంవత్సరాల క్రితంవరకూ అల వాటైన గొంతే.

"కులాసాగా వున్నావా మామయ్యా!"

"ఆఁ, లోపలకు పోదాం రా" అని అతన్ని రెక్కపుచ్చు కుని లోపలకు తీసుకుపోయి "ఇదిగో ఏయ్, సూర్యుడు వచ్చాడు చూడు." అని అరిచాడు.

ఈలోగా అతను తను తెచ్చుకున్న సూట్‌కేసు ఒక మూలను పెట్టి నిల్చున్నాడు. రంగయ్యగారి కేకకు లోపలి నుంచి ఓ నడివయసు స్త్రీ, ఇద్దరు చిన్న కుర్రవాళ్ళు, ఒక పదహారేళ్ళ అమ్మాయి జవాబుగా ప్రత్యక్షం అయారు.

వాళ్ళందరివంకా వరుసగా చూసి సూర్యారావు నిరాశ చెందాడు. అతను ఆశించిన వ్యక్తి కనబడలేదు వెంటనే బయటపడక "అత్తయ్యా! గుర్తుపట్టావా?" అన్నాడు.

నడివయసు స్త్రీ వెంటనే జవాబు చెబుతూ "ఎలా మరిచి పోతాను సూర్యుడూ, యింట్లో నీ పేరు చెప్పుకోని రోజుందా? మరీ మీ అమ్మ...." అని భర్తవంక సందిగ్ధంగా చూసి ఆగిపోయింది.

"మా అమ్మ ఏమిటి?"

రంగయ్యగారు శాంతంగా "నిలబడేవున్నావు. ఆ కుర్చీలో కూర్చో .... కంగారుపడకు సూర్యుడూ, చెల్లెలు పోయింది" అన్నాడు.

"ఆఁ" అని ఒక క్షణంపాటు నిర్విణ్ణపోయి రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకున్నాడు అతను— "అమ్మా! నన్ను విడిచి వెళ్ళిపోయినావా?" అని గొణుగుకుంటూ విలపించ సాగాడు.

"ఊరుకో నాయనా! ఇప్పటి విషయమా యిది? రెండేళ్ళనాటి సంగతి" శాంతమ్మగారు అంది.

సూర్యారావు ఆశ్చర్యంగా చేతులు తీసేశాడు. బాగా ఏడ్చి వుండటంవల్లే అతని కళ్ళు ఎర్రబారి వున్నాయి.

"రెండు సంవత్సరాలనాటి విషయమా?"

గుమ్మంలో నిల్చునివున్న పదహారేళ్ళ అమ్మాయి, ఇతని వంక దీనంగా, జాలిగా చూస్తోంది. "పాపం!" అనుకుంది. తల్లి పోయిన రెండు సంవత్సరాలకు యితనికి యీ విషయం తెలిసింది.

అతని ప్రశ్నకు రంగయ్యగారు సమాధానం చెప్పారు. "అవును. మంచంమీద మూడునెలలు తీసుకుంది. ఎప్పుడూ నిన్ను తలచుకుని ఏడుపే. చివరిరోజుల్లో నిన్ను కళ్ళారా చూడాలని పాపం దాని ప్రాణం తెగగింజుకు పోయింది."

"నాకు హృదయంలేదు. నేను పాపాత్ముణ్ణి, కఠినుణ్ణి."

సూర్యారావు మితిలేని దుఃఖంతో మళ్ళీ హృదయ విదారకంగా విలపించసాగాడు. రంగయ్యగారు దగ్గరకు వచ్చి భుజంమీద చేయివేసి ఓదారుస్తూ అన్నాడు. "ఊరుకో నాయనా! ఏం చేస్తాం? ఏదెలా జరగాలో అదలా జరుగుతుంది."

సూర్యారావు వృద్ధుడైన మామయ్యావంక దీనంగా చూస్తూ "నేను దురదృష్టవంతుణ్ని మామయ్యా అన్ని విధాలా" అన్నాడు.

కొంతసేపు యీ విధంగా సంతాపవాక్యాలతో గడిచిపోయింది. కాని పదహారేళ్ళ అమ్మాయికి యీ పద్ధతి ఎక్కువ నచ్చినట్లులేదు. దగ్గరకు వచ్చి ముఖంలోకి

చూస్తూ "నేను గుర్తున్నానా బావా?" అని నవ్వుతూ అడిగింది.

సూర్యారావు నిదానంగా ఆమెవంక చూస్తూ "నువ్వా? యిందాకటి నుంచీ ఎవరో అని ఊరుకున్నాను. ఎంత మారిపోయావు సీతా?" అన్నాడు ఆశ్చర్యంతో.

ఆమె కిలకిలా నవ్వుతూ "అయిదేళ్ళ క్రిందటి నీ ఫొటో యిక్కడవుంది. దాంతోపాటు అద్దంకూడా తెచ్చిస్తాను. అద్దంలో చూసుకుని ఆ ఫొటోతో పోల్చుకుని నువ్వెంత మారిపోయావో పరీక్షించుకో" అంది.

"అప్పుడు పన్నెండేళ్ళు"

"నాలుగేళ్ళ తర్వాత — యిప్పుడు పదహారేళ్ళు" ఎంత విద్దూరం ఆమె నవ్వు ఆపుకుంటోంది.

"ఏయ్, పెంకిపిల్లా - బొత్తిగా అంత సిగ్గులేదేం?" అంటూ ఆమె జడను అందుకోబోయాడు. తప్పించుకుని పారిపోతూంటే రంగయ్యగారు "అమ్మాయ్, బావకి కాఫీ తీసుకురా" అన్నాడు.

శాంతమ్మగారు యిందాకే లోపలకు వెళ్ళిపోయింది. ఇద్దరు కుర్రవాళ్ళూ గోడకు ఆనుకుని యీ పరిచయంలేని వ్యక్తివంక చూస్తున్నారు.

సీత లోపలకు పోబోతూన్నదల్లా జడ ముందుకు పడేటట్లు గిరుక్కున తిరిగి "ఇంకా ముఖం కడుక్కోలేదేమో నాన్నా!" అంది.

"పర్వాలేదు. ఈ నాలుగేళ్ళలో ముఖం కడిగేసుకోకుండా కాఫీ ఏమిటి, భోజనాలే లేపేసిన సందర్భాలు చాలా వున్నాయి. తీసుకురా" అని అతను జవాబు వెంటనే యిచ్చాడు.

ఆమె లోపలకు వెళ్ళిపోయింది. రంగయ్యగారు కళ్లు చికిలించి మేనల్లుడి వైపు చూశాడు. మరదలు కాఫీ తెచ్చేలోగా సూర్యారావు ఆ యిద్దరి కుర్రవాళ్ళనీ దగ్గరకు పిలిచి కొత్త కుక్క-పిల్లల్ని మచ్చిక చేసుకుంటున్నట్లు మంచి చేసుకోసాగాడు.

అతను కాఫీ త్రాగుతూంటే రంగయ్యగారు ముఖం తుడుచుకుంటూ లోపలకు వచ్చి "ఇదేనా నీ సామ్మాను?" అని ఆ చిన్న సూటుకేసుని చూపుతూ అడిగాడు.

సూర్యారావు చిన్నగా నవ్వుతూ "అంతే, అందులో నైనా ఏదో వున్నదని భ్రమపడవద్దు. మూడు జతలు లాగూలు, చొక్కాలు. కొంత చిల్లరడబ్బు" అన్నాడు.

"ఇంతేనా?" రంగయ్యగారు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు.

"ఊఁ"

ఇంతకాలం అతను ఏమేమి చేసింది, ఎక్క-డెక్క-డ తిరిగింది, ఏమిటి సాధించిందీ అడుగుదామనే వుంది రంగయ్యగారికి. కాని నాలుగేళ్ళ క్రితం చెప్పాపెట్టకుండా పారిపోయాడు. తిరిగి ఆ విషయాలన్నీ కదిపితే మళ్ళీ ఎక్క-డ పారిపోతాడోనన్న భయంతో ఏమీ ప్రశ్నించలేదు. ప్రక్క-నున్న పేము కుర్చీలో కూర్చుంటూ "అమ్మాయి! నాకు కాఫీ తీసుకురావమ్మా!" అని కేకవేశాడు. రెండు నిమిషాలలో సీత కాఫీ పట్టుకువచ్చి తండ్రికి యిచ్చి వెళ్ళిపోయింది.

ఇద్దరు ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకోసాగారు. సూర్యారావు తన విషయం ఏమీ చెప్పకుండా యీ వూరు ఎలా వుందీ ఎలా మారిందీ తనకు తెలిసిన యీఊళ్ళో వ్యక్తుల విషయం ప్రశ్నిస్తూ తెలుసుకోసాగాడు.

చాలాసేపు యీ విధమైన సంభాషణతో గడిచిపోయింది. ఇంతలో పనివాడు వచ్చి "నీళ్ళు తోడానని" చెప్పేసరికి తువ్వాల తీసుకుని సూర్యారావు లోపలకు వెళ్ళాడు.

ఇక్కడకు వచ్చినతర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే అతను రకరకాలుగా మారాడు. విచారమూ, సంతోషమూ, ఆశ్చర్యమూ వీటిల్లో ఏదీ అతనిలో అతన్ని ఎక్కువసేపు అంటిపెట్టుకుని వుండలేదు. తల్లిపోయిన విషయం తెలిసి, ఆ దుఃఖంలో వున్నప్పుడు చాలా సులభంగా, తెలిసీ తెలియకుండా సీత అతనిలో అద్భుతమైన మార్పు తీసుకువచ్చింది.

ఆ యింట్లో కొత్తదనం చాలా కొంచంసేపు మాత్రం అతను అనుభవించాడు. తరువాత అనుకోకుండానే నాలుగేళ్ళ క్రిందటి సూర్యారావుగా మారిపోయాడు. ఇంట్లో చనువుగా తిరగసాగాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు శాంతమ్మగారు "సూర్యుడూ! భోజనానికి లే నాయనా!" అని కేకవేసింది. రంగయ్యగారు ముందే వెళ్ళిపీటమీద కూర్చున్నారు. సూర్యారావు వంటింట్లోకి పోబోతూ ప్రక్కగదిలోంచి వస్తూ తనని చూసి హఠాత్తుగా ఆగిపోయిన వ్యక్తినిచూసి చకితుడై నిలబడిపోయాడు. ఆమె తబ్బిబ్బుపడి చాటుకు తప్పుకుందామని ప్రయత్నించికూడా, ఆ విపరీతమైన స్థితిలో ఏమీ చేయలేక విఫలురాలై తలవంచుకుని నిలబడింది. ఒకటి రెండు క్షణాలు అలాగే నిలబడి తరువాత అతను ఏదో అందామని ప్రయత్నించాడు. కాని మనసూ, నోరూ రెండూ వొప్పుకోలేదు. గబగబ నడిచి లోపలకు వెడుతూ "ఇదేమిటి? ప్రొద్దున్న నుంచీ కనబడలేదేం? తప్పించుకుని తిరుగుతూందా?" అనుకున్నాడు.

ఎంత ప్రయత్నించినా తన మనసులో ఉదయించిన ఒక ప్రశ్నను అతను దాచుకోలేకపోయాడు. చివరకు ధైర్యంచేసి "మామయ్యా! శకుంతల...." అంటూ ఆయన ముఖం వంక చూస్తూ ఆగిపోయాడు.

"ఏమిటీ?"

"పెళ్ళయిందా?"

ఆయన వెంటనే జవాబు చెప్పలేదు. తలఎత్తి భార్య వంక చూశాడు. ఆమెకు ఏమీ పాలుపోక అక్కడ వుండలేక ప్రక్కకు వెళ్ళిపోయింది.

"అయింది. ఇన్నాళ్ళు కాకుండా ఎలా వుంటుంది?" అన్నాడాయన మెల్లగా.

"ఎవరతను?" సూర్యారావు వెంటనే అడిగాడు.

"ఎవరయితేనేం? యిప్పుడు లేడు"

"అదేమిటి?"

"టైఫాయిడ్ వచ్చిపోయాడు"

"శకుంతల వితంతువా?"

ఆయన మాట్లాడకుండా తలవంచుకుని అన్నం కలుపుకుంటున్నాడు.

"ఇక్కడే వుంటుందా?"

దీనికి కూడా ఆయన సమాధానం చెప్పలేదు. కాని అవతల నుంచే శాంతమ్మగారు "మరి ఎక్కడ వుంటుంది నాయనా? మేముగ్గాక దాన్ని యిహ ఎవరు ఆదరిస్తారు?" అంది గాద్గదికంగా.

జరిగిపోయిన సంగతులు ఏవేవో గుర్తుకువచ్చి సూర్యా రావు హృదయం కలచివేసినట్లయింది. అమాంతంగా అతని మనసంతా శకుంతల ఆక్రమించుకుని కూర్చుంది.

"మరి....యిక అంతేనా ?"

"అంటే ?" రంగయ్యగారు ప్రశ్నార్థకంగా చూశాడు.

"శకుంతల గతి"

"అంటే ?"

సంభాషణ యిద్దరిమధ్యా అంతే జరిగింది. ఇవాళ ఆ యింట్లో గడచిపోయిన గాథలనెమరువేత ప్రతివారిలోనూ ఆవ హించింది. సూర్యారావు యీ ఆకస్మిక ఆగమనమే దానికి ముఖ్యకారణం.

"మళ్ళీ పెళ్ళి చేయకూడదా ?" అని అడుగుదామను కున్నాడు. కాని మామయ్య స్వభావం ఎక్కువ అతనికంటే చాలా తక్కువ మందికి తెలుసు. ఊరుకున్నాడు.

ఆమధ్యాహ్నం అతను సావిట్లో పడకుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు. అక్కడకు మెల్లగా సీత వచ్చింది. రంగయ్యగారు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

"బావా ! ఏమిటి ఆలోచిస్తున్నావు ?"

సూర్యారావు ఉలుక్కుపడి చూసి "ఏమీ లేదు మర దలా" అన్నాడు.

ఆమె కొంచం దగ్గరకు వచ్చి "నాకోసం ఏమీ తీసుకు రాలేదా నువ్వు ?" అని అమాయకంగా అడిగినట్లు అడిగింది.

"నీకోసం ఏదయినా ఎందుకు తీసుకురావాలి ?"

"నువ్వు వొట్టి పిసినారివి."

"డబ్బులేని ప్రతివాడూ పిసినారే"

ఆమె ఆశ్చర్యంగా "ఇంతకాలం నువ్వేమీ సంపాదించ లేదా ?" అనడిగింది.

"ఊహుఁ"

"మరి ఎలా గడిపావు ?"

"ఎంతసేపూ తిరగటం"

"ఎక్కడెక్కడ?"

"దేశం అంతానూ"

"ఊరికినే తిరిగావా ?"

"ఊఁ. డబ్బు అయిపోయినప్పుడు ఏదో ఉద్యోగం చేసేవాడిని. అలా అని పరువు తక్కువగా ఎప్పుడూ ప్రవర్తించ లేదు. నలుగురిలోనూ మంచి సంపాదించుకున్నాను. రకరకాల వ్యక్తులతో పరిచయం చేసుకున్నాను. దిగులుగా, బాధగా ఏనాడూ గడపలేదు. తిరిగి యింటికి వచ్చేటప్పుడు వెళ్ళే టప్పుడు ఎలా వున్నానో అలానే వచ్చాను."

కొంచం ఆగి సీత "నీ సూటుకేసు తెరిచిచూడ మన్నావా?" అనడిగింది.

అంగీకారంగా సూర్యారావు తల ఊపాడు.

లోపలనుంచి సూట్‌కేసు తెచ్చి అతనిముందు విప్పి చూసింది. అతను చెప్పిన మాటల్లో అబద్ధం ఏమీ లేదని గ్రహించటానికి ఆమెకు ఎక్కువసేపు పట్టలేదు. తిరిగి మూసి వేయబోతూండగా ఫోటోల ఆల్బమ్ ఒకటి ఆమె దృష్టిని ఆకర్షించింది. "అదేమిటి?" అని దాన్ని తీసుకోబోయింది.

ఇందాకటినుంచి మెదలకుండా ఊరుకున్న సూర్యా రావు, కంగారుగా "వద్దు. అది తీయబోకు" అన్నాడు.

తన ప్రయత్నాన్ని విరమించి ఆమె "ఏం?" అనడిగింది తెల్లబోయి.

"ఊరికినే, దానిని ఎవరికీ చూపించటం నాకిష్టంలేదు."

"సరే"

ఆమె తిరిగి సూటుకేసును యథాతథంగా మూసివేసింది. సూర్యారావు జేబులోంచి సిగిరెట్టు తీసి వెలిగించుకుని వెనక్కు జారగిల పడ్డాడు.

చిన్నగా అతనిదగ్గరకు వచ్చి సీత "బావా! నినోక ప్రశ్న అడగనా?" అంది.

"అడుగు"

"నువ్వు యిక్కడ్నుంచి ఎందుకు పారిపోయావు?"

మరుక్షణంలో సూర్యారావు ముఖం పాలిపోయింది. ఒకసారి ఆమె వైపు చూసి, తలవంచుకుని "ఊరికినే" అన్నాడు.

"కాదు, నాకు చెప్పకూడదా?"

"లేదు. చెప్పకూడనిది ఏమీలేదు"

"అయితే, సరే" అని ఆమె అక్కడినుంచి నిష్క్రమించబోతూంటే "మాట" అని ఆపి "యిలా అడిగానని ఎవరితోనూ అనకేం? మీ అక్కయ్య నన్ను ఎప్పుడైనా అడిగిందా?" అని అడిగాడు.

"ఆఁ, చాలాసార్లు"

"ఏమని?" అని సూర్యారావు ఉత్కంఠతో ప్రశ్నించాడు.

"బావ ఎంతో మంచివాడు, నేనంటే చాలా ప్రేమ. ఎందుకని వెళ్ళిపోయాడో మరి? అని"

అతను నిట్టూర్పు విడిచాడు.

ఆమె తిరిగి "ఎప్పుడూ ఏడుస్తూనే వుంటుంది అక్కయ్య" అంది.

"ఎందుకు?"

"నిన్ను పెళ్ళి చేసుకోలేదని ఏమో!"

"పో"

"పోతున్నాను" అని ఆమె వెళ్ళిపోతూంటే మళ్ళీ ఆపి "ఆ పెళ్ళి చేసుకోవటానికి ఏమయినా అభ్యంతరం చెప్పిందా?" అని గబగబ అడిగాడు.

"ఎక్కువ లేదులే, మనసులో ఏమనుకుందో, బయటకు ఏమీ గోలచేయలేదు"

అతను ఏమీ మాట్లాడకుండా ఒకసారి గట్టిగా సిగరెట్ పీల్చి నెమ్మదిగా పొగ వొదిలేశాడు.

కాని సీత అక్కడినుంచి వెళ్ళిపోవటానికి యీసారి ప్రయత్నించలేదు. అతనికి మరికొంచెం దగ్గరకువచ్చి, కళ్ళలోకి అనునయంగా చూస్తూ "ఏమిటో అడగకుండా వుండలేక పోతున్నాను. మీ యిద్దరికీ పెళ్ళి నిశ్చయం అయిందాకా బాగానే వున్నావు. అప్పుడే.... ఏం? అక్కయ్యని పెళ్ళి చేసుకోవటం యిష్టంలేదా?" అంది.

సూర్యారావు ఒక క్షణం ఆమెవంక విస్మితంగా చూసి, చేతిలోని సిగరెట్‌ని మూలకి బలంగా విసిరేసి "ఊహుఁ, అది కాదు" అంటూ విసురుగా లేచి, అదేవేగంతో బయటకు వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం అతను మండపం దగ్గరకు పోదామని బయలుదేరి, మెల్లగా నడుస్తున్నప్పుడు అటూ యిటూ వున్న

యిళ్ళలోంచి వాళ్ళూ, వీళ్ళూ తనని రహస్యంగా చూస్తున్న విషయం కనిపెట్టి కొంచం సిగ్గుతో నవ్వుకున్నాడు.

చిన్నప్పుడు తను ఎంత అల్లరి చిల్లరిగా తిరిగాడు ? ఈ ఊరు, యీ యిళ్ళు తనకు ఎంతో పరిచితం. ఈ నాలుగేళ్ళ కాలంలో ఎన్నిమార్పులు జరిగాయో ! ఆనాడు తనకు స్నేహితులుగావున్న వాళ్ళకీ, తనకు తెలిసివున్న స్త్రీలకూ ఎంత మందికి పెళ్ళిళ్ళు అయినాయోఏమో ! తనే ఏమీ లేకుండా అయోమయంగా గడిపాడు. వేణుగోపాలస్వామి ఆలయం ముందు వున్న మండపంమీదకు వచ్చి కూర్చున్నాడు. ఈ మండపంమీదనే కూర్చుని తను పూజారి అయిన ఆచార్లు గారితో గంటలు, రోజులు కబుర్లు చెబుతూ, వేసవి రాత్రులు అక్కడే పడుకుంటూ కాలం గడిపాడు. ఈ ఊళ్ళో తన ముఖ్య స్నేహితుడు అతనే. మధ్యాహ్నం అతన్ని కలుసుకోలేదు.అతని యిల్లుకూడా గుడిని ఆనుకునే.

"ఆచార్లుగారూ!" అని కేకవేయబోయి ఏదో స్ఫురణకు వచ్చి, నవ్వుకుని 'బావగారూ!' అని పిలిచాడు. అప్పటి అలవాటది.

"ఊరికి వెళ్ళారు" అని వినిపించీ, వినిపించనట్లుగా యింట్లోంచి జవాబు వచ్చింది.

సూర్యాస్తమయం యింకా కాలేదు.వంటరిగా అలానే కూర్చుని నీటికోసం ఏటికి పోయివచ్చే మనుషుల్ని చూడ సాగాడు.

అతనికి హఠాత్తుగా యిందాక సీత వేసిన ప్రశ్న స్ఫురించినది. ఎందుకు పారిపోయాడు ? ఇక్కడినుంచి ఎందుకు పారిపోయాడు ? నాలుగేళ్ళనాటి చిన్నపిల్ల సీత, ఆమె అక్క-

శకుంతలా, యీ ఊరూ అన్నీ వరుసగా కళ్ళలో మెదిలాయి. అప్పుడు....

అతని ఆలోచనకు ఆటంకంపరుస్తూ యింతలో "బాబుగారూ!" అన్న కంఠధ్వని వినిపించినది. ఉలిక్కిపడి చూశాడు-వెంకటస్వామి.

"నువ్వా? ఫకీరా" అన్నాడు.

అతను మెట్లు ఎక్కి మండపం మీదకు వచ్చి సుదూరంలో క్రింద కూర్చున్నాడు.

"మీరు వచ్చారని పొద్దుటే విన్నాను. అప్పుడే వద్దామనుకుంటే యీల్లేకపోయింది. ఎన్నాళ్ళకి చూశాను?" అన్నాడు.

"ఆశ్చర్యంగా ఉంది కదూ?"

"ఆశ్చర్యంకాక మరేటి? మీరసలు ఎందుకు పారిపోయారో ఎవరికీ తెలవదాయె. చాలా రోజులపాటు ఊరంతా యీ యిశేషమే చెప్పుకుంది. అదంతా పోనియ్యండి. సిగిరెట్టుందా?"

సూర్యారావు మాట్లాడకుండా జేబులోంచి సిగిరెట్ తీసి ఒకటి అతనివైపు విసిరేశాడు. అతను ఒకసారి అటూ యిటూ చూసి "పరవాలా ఆచార్లుగోరు లేరు" అని గొణుక్కుంటూ జేబులోంచి అగ్గిపెట్టెతీసి వెలిగించాడు.

"ఏమిట్రా? పెళ్ళి చేసుకున్నావా?"

"పెళ్ళా?" అని అతను కళ్ళు చిట్లించి "మనకొద్దు బాబూ! చూశాను....చూశాను....కంటికి నచ్చింది ఒకటీ అగుపడదలా. అయినా యీ కాలంలో ఆడదాన్ని నమ్మినంత

వెర్రిపని యింకోటిలేదు. నమ్మి మోసపోవటం ఎందుకని అసలా ఉద్దేశమే వొదిలేశాను" అన్నాడు.

సూర్యారావు ఎక్కడికో చూస్తూ "నిజమేరా" అన్నాడు.

కొంచంసేపు నిశ్శబ్దంగా గడిచాక "మరి యిన్నాళ్ళు తిరిగారు. పెళ్ళీ గిళ్ళీ ఏమయినా—" అని ఆకస్మికంగా అడిగాడు వెంకటస్వామి.

సూర్యారావు ఆశ్చర్యంగా "అన్నీ నువ్వేనా? ఇంతకు ముం దకదురా. పెళ్ళి చేసుకోవటం బుద్ధితక్కువపని అన్నావు" అన్నాడు.

"అది నా యిశయం? బాబుగారేటి? అయినా మంచిది కాదని అన్ని పన్లూ వొదిలేస్తున్నామా?"

"యింకా చేసుకోలేదు"

"అయితే యిక్కడికి వొచ్చేశారుగా. యిక అవుతాది లెండి"

"అదేమిటి?"

"సీతమ్మగారుండిగా"

"పోరా!"

"ఏం పోరా? నాకన్నీ తెలుసు బాబుగారూ. రంగయ్యగారు మిమ్మల్నంత తేలిగ్గా వొదిలేశయ్యారు లెండి. మీరు యిక్కడ్నుంచి వెళ్ళిపొయ్యాక నిజంగా దిగులు పడ్తారంటారా? అంతా బూటకం"

సూర్యారావు మాట్లాడలేదు.

"ఆరి మొదటమ్మాయిగారినే మీ కంటకడదామని ఓ సూపు చూశారు. ఊహుం, సాగలా. సరే, ఆరి బతుకు అట్టా

తెల్లారిపోయింది. అట్టా ఇట్టా తిరిగి మీరు మళ్ళీ వచ్చేతలికి రెండో పిల్ల రెడీ. మీ యిద్దరికీ సంబంధం కలపాలని ఆయన పట్టుబట్టకపోతే యీ సెవి యిట్టా కోయించుకుంటాను. ఆఁ"

సూర్యారావు చిన్నగా నవ్వి "అందులో విడ్డూరం ఏముందిరా? మేనమామగదా. మేనరికం కలుపుకోవాలని ఎవరికి ఉండదు?" అన్నాడు.

వెంకటస్వామి కళ్ళు పెద్దవి చేసి "అదీ! మీరు ఆరివల్లో బాగానే పడ్డారన్నమాట. బాబుగారూ! ఇన్నేళ్ళు దేశం తిరిగొచ్చినా మీకు బాగా గ్యానం అబ్బలేదు. రంగయ్యగారి తంతంతా నాకు తెలుసు. మీ నాయనగోరు పోయినప్పటి నుంచి ఎందుకంట మిమ్మల్ని సేరదీసింది! మీమీదేం ఆయనకి మమకారం వొలికిపోతుందా? అసలు ఆయన ఆస్తి ఏపాటి? ఆస్తంటే మీదీ. మిమ్మల్ని పరాయి చోటికి పోనియ్యకుండా యింట్లో కట్టేసుకుంటె లాభం ఎవరికి? సెప్పండి" అన్నాడు.

"మామయ్య మనసులో అటువంటి ఆలోచనలు వున్నాయంటే—నేన్నమ్మను"

"అవున్లెండి. మీకు బాగా వెర్రి తలకెక్కింది"

యీ మాట హృదయానికి వాడిగా తగలగా, కొంచెం కోపంగా "అప్పటికీ యిప్పటికీ నీ ప్రవర్తనలో మార్పు ఏమీ లేదుగదా అప్పుడూ యిలాగే నూరిపోసేవాడివి. నువ్వేన్నయినా చెప్పు. మామయ్య అంటే నాకు చాలా భక్తి గౌరవాలున్నాయి. ఆయనేం చేసినాసరే నాకు యిష్టమే" అన్నాడు.

వెంకటస్వామి చిన్న దెబ్బతిని "అంతేలెండి. మామా అల్లుళ్ళకి యిద్దరికి యిష్టమైనప్పుడు మధ్యన నాదేమిటి" అన్నాడు.

కొంతసేపు యిద్దరూ మాట్లాడలేదు. తరువాత వెంకట స్వామి లేచి "పనుంది. వెళ్తాను" అంటూ గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

"ఎవరి గొడవ వాళ్ళది" అనుకున్నాడు సూర్యారావు. వంటరిగా కూర్చునేందుకు విసుగుపుట్టి ఇంటికి వెళ్ళిపోదామని మండపం దిగి వచ్చేటంతలో ఎదురుగా వస్తూన్న వ్యక్తిని చూసి కంగారుపడ్డాడు. ఆ వ్యక్తి చూడకుండా వెనక్కి వెళ్ళి పోదామనుకున్నాడు. కాని అతను చూడనే చూసి "ఎప్పు డొచ్చారు ?" అని చిరునవ్వుతో పలకరించాడు.

అతన్తో మాట్లాడటమంటే సూర్యారావుకు అసహ్యంగా వుంది. ఇంతధైర్యంగా తనను పలకరిస్తాడేమిటా అని ఆశ్చర్యం కూడా చెందాడు. కాని యిక్కడి నుంచి తను పారిపోయే ముందు తమ యిద్దరిమధ్యా వైరం ఏమీ లేదన్న విషయం గుర్తుకువచ్చి "పొద్దున్న" అని సమాధానం యిచ్చాడు.

"ఎన్నాళ్ళకి చూశాను" నవ్వుతున్నాడతను.

"దుర్మార్గుడా !" అనుకున్నాడు సూర్యారావు. మన స్సులో అతని నవ్వుకు గుండె మండిపోతోంది.

"కులాసాగా వున్నారా ?"

"ఊఁ" యిష్టం లేనట్టుగా గొణిగాడు.

తరువాత తప్పనిసరిగా "నువ్వో ?" అన్నాడు.

"ఆఁ నాకులాసా కేమొచ్చింది లెండి"

సూర్యారావు మాట్లాడకుండా ఊరుకునేసరికి "వస్తాను. మళ్ళీ కనిపిస్తాను" అని గోవిందం అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయినవంకే చూస్తూ క్రోధంగా కొంచెం సేపు నిలబడ్డాడు. వీడే. అంతా చేసింది వీడే.

తెప్పరిల్లి మెల్లిగా నడిచి యింటికి వచ్చాడు.

ఆ రాత్రి అతనికి చాలా సేపటిదాకా నిద్ర పట్టలేదు. ఎన్నో సంగతులు గుర్తుకు రాసాగాయి. శకుంతల తనకుభార్య కావలసింది. తనభార్య అయితే ఆమెవితంతువు అయ్యేదికాదు. కాని తను బ్రతికివుండగా శకుంతలను పెళ్ళిచేసుకునేవాడు కాదు. ఆమే చేతులారా చేసుకుంది. బాధతోనూ, విచారం తోనూ, కోపంతోనూ, అతని శరీరం వొణికింది.

తనకు తెలుసు. ఎంత యిష్టంలేదని సరిపెట్టుకుందా మన్నా, ఎంత తోసుకుని తిరుగుదామన్నా ఆమెను పలకరిం చాలని వుంది ఆమెతో మాట్లాడాలని వుంది.సరదాగా వుండా లని వుంది. కాని....అతను ఆలోచించలేకపోయాడు.

*   *   *

నాలుగురోజులు గడిచాయి. ఇదివరకటి స్వాతంత్ర్యం తిరిగి యీ యింట్లో సంపాదించినా, వెనకటిలా స్వేచ్ఛగా మసలుకోలేకుండా వున్నాడు సూర్యారావు. చేసేందుకు యే పనీ లేకపోవటం వల్ల అతనికి విసుగ్గావుంది. ఏమీ పొద్దు బోవటంలేదు. ఎంతసేపని తిరుగుతాడు?పగటిపూట మామయ్య సాధారణంగా యింట్లో వుండడు మెంతసేపూ సీతతోనో చిన్న కుర్రాళ్ళతోనో కబుర్లు చెప్పుతూ గడపాలి.

శకుంతల అతనికి సాధారణంగా కనబడదు. ఎంతసేపని అలాదాక్కొగలుగుతుందో అతనికి ఆశ్చర్యంగా వుండేది. ఎప్పుడూ వంటరిగా, రహస్యంగా కూర్చుని కాలం ఎలా గడుపు తుందోనని అనుకునేవాడు.

ఒకటి రెండుసార్లు మాట్లాడదామని ప్రయత్నించాడు

కాని తీరా ఆ సమయం వచ్చేసరికి నిద్రదొక్కుకుని, అక్కడి నుంచి తప్పించుకు పోయేవాడు.

కాలక్షేపంకోసం సీతకు పేకాట నేర్పించాడు. తీరికై నప్పుడు ఆమె వచ్చి అతనితో ఆడేది.

ఒకరోజు మధ్యాహ్నం పేకాటలో యిద్దరూ వుండగా ఆమెవంక పరిశీలనగా చూస్తూ "మరీ పెరిగిపోతున్నావు.చప్పున పెళ్ళి చేసుకో" అన్నాడు.

"ఏం ?"

"లేకపోతే పాడయిపోతావు"

"నేను నిన్నే చేసుకుంటాను"

"ఛీ! బొత్తిగా సిగ్గు లేదేం ?"

"సిగ్గెందుకు బావదగ్గర ?"

సూర్యారావు కొంచెం కోపంగా "అంతా నీ యిష్ట మేనా ? నేను చేసుకోను" అన్నాడు.

"నా యిష్టం కాకపోతే నీ యిష్టమా ఏమిటి ? అక్కయ్య వెర్రిది కాబట్టి నిన్ను పారిపోనిచ్చింది. నేను మాత్రం నిన్ను వదలను"

"ఫో, పెంకిపిల్లా" అంటూ సూర్యారావు అక్కడ్నుంచి లేచి బయటకు వెళ్ళిపోయాడు. అతనికి భయంగావుంది. ఇంకా తను వచ్చి నాలుగురోజులయినా కాలేదు. అప్పుడే పెళ్ళి ప్రయత్నాలు తలపెట్టారా ఏం ? అనుకున్నాడు. లేకపోతే సీత అలా ఎందుకు అంటుంది? ఆమె ఏమీ అమాయకురాలు కాదు.

ఒకవేళ అలా జరిగితే....మామయ్యతో ఏం చెప్పాలి?

అతనికి ఏమీ తోచలేదు. మండపం మీదకు పోయి కళ్ళు మూసుకుని పడుకున్నాడు. తను ఇక్కడకు రాకుండావుం

టనే బాగుండేదేమో, ఏమాత్రం విశ్రాంతి లేకుండా యిన్నాళ్ళు తిరిగాడు. ఎంతో అనుభవం సంపాదించాడు. చివరకు యిక్కడకు వచ్చి వెనకటి జీవితాన్ని తిరిగి ప్రారంభించబోతున్నాడా?

గోవిందం వికటంగా నవ్వుతూ మాటిమాటికీ కళ్ళ ముందు కనిపించసాగాడు. కళ్ళు మూసుకున్నా కనిపించాడు.

తను ఎందుకు పారిపోయాడు? ఎందుకు పారిపోయాడు?

మళ్ళీ....

అతనికి నిద్రపట్టింది.

* * *

చివరకు అనుకున్నంతా జరిగింది. మరునాటి. రాత్రి తనప్రక్క మంచంమీద పడుకున్న రంగయ్యగారు "చూడు సూర్యుడూ" అన్నాడు.

"ఏమిటి మామయ్యా"

"నీకో విషయం చెప్పాలయ్యా"

"ఏమిటి!"

ఆయన కొంచం తటపటాయించి "నీగురించి నాకు నమ్మకం వుంది. ఏ పని కూడా అనాలోచితంగా ఎప్పుడూ చేయవు. ఇన్నాళ్ళు తప్పించుకు తిరగటానికి ఏదో కారణం వుండేవుంటుంది. అయినా ఆ విషయాన్ని గురించి నిన్నేమీ అడగను. నిన్ను బాధపెట్టను" అన్నాడు.

సూర్యారావు మాట్లాడకుండా వినసాగాడు.

"నీకోసం నేను పడిన బాధ చచ్చి స్వర్గంలోవున్న మీ అమ్మ పడిన బాధకన్నా ఏమాత్రం తక్కువదికాదు. ఎన్నాళ్ళో నీకోసం వెదికించాను. చివ్వరికి నీ అంతట నీవే వచ్చావంటే ఎంతో సంతోషించాను"

"నీవిషయం నాకు తెలుసును మామయ్యా!" అని సూర్యారావు అస్పష్టంగా గొణిగాడు.

"మేనరికం వుండి పరాయి సంబంధంకోసం చూస్తే లోకం అంతా ఆడిపోసుకుంటుంది. ఈ ఊళ్ళోవాళ్ళ విషయం నీకు తెలీదు గనకనా? అయినా వేరే ఎవరితోనో ముడిపెట్టు కోవటం నాకూ యిష్టం లేదు"

సూర్యారావు క్రమక్రమంగా అర్థం చేసుకోసాగాడు.

"నువొచ్చి యింకా నాలుగురోజులయినా కాలేదు. అప్పుడే యీ సోది మొదలుపెట్టాడేమా అని అనుకుంటున్నా వేమో, అవతల సీత ఈడుమించి పెరిగిపోతూంది. మీ అత్తయ్యకూడా ఊరికినే తొందరపడుతూంది. అతిశయోక్తి అనుకో, ఇంకేమయినా అనుకో. ఇన్నాళ్ళు నీకోసం ఆగాను. నీకు వయస్సు పెరిగిపోయిందేమోనని అనుకుంటున్నావేమో. పాతికేళ్ళు పెద్దవయస్సేమీ కాదు. నీ ఉద్దేశం ఏమిటి?"

సూర్యారావు వెంటనే మాట్లాడలేదు.

"ఇంకో విషయంకూడా వుంది. చెల్లెలు పోతూ పోతూ నాచేత వొట్టుకూడా వేయించుకుంది. 'అన్నయ్యా! శకుంతలని నాకోడలు చేసుకుందామని ఎంతగానో ప్రయత్నించాను. కాని దైవం వేరువిధంగా వున్నాడు. సూర్యుడు ఏనాటికైనా తిరిగి వస్తే నేను వున్నా లేకపోయినా వాడిని నీ అల్లుడుగా చేసుకోవా?' అని ప్రాథేయపడింది. అలాగే నన్నాను"

సూర్యారావు చీకట్లో మామయ్య ముఖంవంక చూడటానికి ప్రయత్నించాడు.

"బలవంతపెట్టి నిన్ను వొప్పించను. నీ యిష్టం నీ ఉద్దేశం ఏమిటి?"

"నేను కొంచెం ఆలోచించుకోవాలి మామయ్యా!"

"సరే"

మళ్ళీ సూర్యారావు "దీనికినువ్వు వేరువిధంగా అనుకోకూడదు. తల్లీ, తండ్రీ నా కెవరూ లేరు కాబట్టి నా పెళ్ళిని గురించి ఆలోచించుకోవలసిన బాధ్యత నాదే కాబట్టి అలా అన్నాను" అన్నాడు.

"ఆలోచించుకో నాయనా! తప్పేం ?"

ఆయన తిరిగి మాట్లాడలేదు. సూర్యారావు యిటు తిరిగి పడుకున్నాడు. అతని మనసంతా చికాకుగా వుంది. మామయ్యతో తను ఏమని చెబుతాడు? ఇష్టం లేనందుకు కారణం ఏమని చెబుతాడు? చెప్పలేడు.

చెప్పకుండా ?

తిరిగి పలాయనం చిత్తగిస్తాడా ?

కాదు ఊహుఁ, ఈసారి తెగించి ఏదో చెప్పాలి.

మరునాడు మామయ్య ఇంట్లో లేనప్పుడు అత్తయ్యతో మెల్లగా అన్నాడు. "నా కెందుకనో ఎక్కువ యిష్టంగాలేదు అత్తయ్యా!"

ఆమె అంతరార్థం గ్రహించి "ఎందుకు? సీత బాగుండదా ?" అన్నది.

"బాగుండకేం? శకుంతలకన్నా అదే బాగుంటుంది ?"

"మరి, ఇంకేం ?"

"అదికాదు" తటపటాయిస్తున్నాడు.

"ఓహో ఆస్తిపాస్తులతో మేము తులతూగలేమనా ? నిజమే. మేము నీ అంత ధనవంతులము కాదు. కాని బంధుత్వం అనేది ఒకటి వుందికదా. అదీగాక నువ్వు ఇక్కడలేన

ప్పుడు మీ మామయ్యే గనుక పూనుకోకుండా వున్నట్లయితే సెంటు భూమికూడా నీకుమిగలకుండా లోకులు తన్నుకుపోయే వాళ్ళు. ఆయన నీమీది మమకారంతో సొంత పొలంలా చూసుకున్నారు. రేపో, ఎల్లుండో నీ పొలం నీకు అప్పజెబుదా మనుకుంటున్నారు. అవిశ్వాసం అయినా వుంచు సూర్యుడూ!"

"అదికాదు" అని అతను యింకా తటపటాయిస్తు న్నాడు.

"దేశాలు తిరిగి వచ్చినవాణ్ని. నేను అంత మం అల్లుణ్ని కాదేమో....నాకంటే...."సూర్యారావు చివరికి అన్నాడు.

శాంతమ్మగారు నిష్ఠూరంగా "చాల్లే, ఎక్కడ నేర్చు కున్నావేం ఈ అతిశయోక్తులు ?"

సూర్యారావు దెబ్బతిని మాట్లాడలేక ఊరుకున్నాడు.

"నువ్వు ఊఁ, అంటే వేగిరం కానిచ్చేద్దాం అనుకుంటు న్నాం. మాకూ తొందరగా వుంది"

"నా కెందుకో ఎక్కువ యిష్టంగాలేదు అత్తయ్యా!' అతను ఎలాగో ధైర్యంచేసి అన్నాడు. ఆమె అతనివంక ఆశ్చ ర్యంగా చూసి "నీ మనస్సులోది స్పష్టంగా చెప్పనాయనా!" అంది.

అక్కడినుంచి లేచిపోతూ సూర్యారావు 'ఏమో, నేను బాగా ఆలోచించుకోవాలి' అని బయటకు వెళ్ళిపో యాడు.

ఈ పెళ్ళి విషయం చాలా ధృఢంగానే అందరి మనసు ల్లోనూ నాటుకుని వుందని అతను గ్రహించాడు. ఏమీ సమా ధానం చెప్పకుండా తటస్థంగా ఊరుకునేందుకు కూడా వీలు

లేని పరిస్థితి. "బావంటే నాకు యిష్టంలేదు" అని సీత అంటే బాగుండునని అనుకున్నాడు. కాని "అమ్మో! అదా అనేది. నాతోనే సరదాగా చెబుతుంటేనూ" అని వెంటనే అనుకుని, బాధపడి ఊరుకున్నాడు.

ఆ రోజంతా యింట్లో వుండకుండా సూర్యారావు పొలాల వెంబడి నడిచీ, ఏటి వొడ్డున కూర్చునీ గడిపాడు. ఒకోక్క ఉద్రిక్తావస్థలో "అసలు విషయం చెప్పివేస్తే?" అనుకునేవాడు. కాని 'అంత సాహసం తనకు వుందా?' అన్న సందేహం తోచినప్పుడు మరుక్షణంలో చప్పబడిపోయేవాడు.

ఇంటికి వచ్చి భోజనం చేశాక ఎవరితోనూ మాట్లాడకుండా పడుకున్నాడు ఏమనుకున్నారో, ఏమిటో అతన్ని ఎవరూ పలకరించలేదు.

సూర్యారావుకు ఒక రాత్రివేళ మెళకువ వచ్చింది. కాని ఈ మెలకువ రావడంలో అతనికి స్వాభావికం ఏమీ కనపడక పోయేసరికి కళ్ళు చికిలించుకుని చూశాడు. బయట చలిగా వుండటంవల్ల యివాళ గదిలో పడుకున్నాడు. మరీ చీకటిగా వుండటంవల్ల మొదట ఎవరూ కనబడలేదు. కాని చీకటికి కళ్ళు కొంచం అలవడ్డాక కాళ్ళ దగ్గర ఎవరో నిలబడి వుండటం చూశాడు. తనను లేపిందికూడా ఆ వ్యక్తే అని గ్రహించి తెల్లబోయిలేచి కూర్చున్నాడు. కొంచంగా భయం వేస్తోంది. ఆ వ్యక్తి....సీతలా వుంది. "ఎవరు?" వొణుకుతూ అడిగాడు.

"ఉష్, బయటకురా"

సీత కాదు శకుంతల. అతను ఆశ్చర్యచకితుడయ్యాడు. అవును, శకుంతలే.

"ఏమిటి ?"

"బయటకు"

ఏమీ చేయలేక మెల్లగా ఆమె వెనక పిల్లిలా నడచి వొచ్చాడు. కొంచం గట్టిగా మాట్లాడుకున్నా ఎవరికీ వినిపించ నంత దూరం వచ్చి, వేపచెట్టు క్రింద నిల్చున్నారు. చలీ, భయం ఈ రెండూ సూర్యారావును కంపితుణ్ని చేశాయి.

"నిన్ను ఓ ప్రశ్న అడుగుదామని వచ్చాను" అంది శకుంతల చిన్నగా.

అతనికి అంతా కలలాతోచింది. ఏనాటి శకుంతల ? తను ఆమెతో మాట్లాడి కొన్ని సంవత్సరాలు గడిచింది. ఇక్కడకు వచ్చాక కూడా తనూ మాట్లాడలేదు; ఆమెకూడా తప్పించుకుని తిరిగింది. కాని ఈ రాత్రివేళ యిక్కడ యింత నిబ్బరంగా తనంతట తాను వొచ్చి మాటాడగలుగుతోంది. "ధైర్యం అంటే స్త్రీలదే" అనుకున్నాడు.

"ఏమిటి ?"

"ప్రశ్న కూడా కాదులే. అవసరం అయితే ప్రాధేయ పడదామని కూడా అనుకున్నాను"

"చెప్పు" అన్నాడు సూర్యారావు ఆదుర్దాగా.

"నువ్వు యిక్కడ్నుంచి ఎందుకు పారిపోయావు?"

"ఇదేనా నువ్వు అడగదలచుకున్న ప్రశ్న?" కోపంతో అడిగాడు సూర్యారావు.

"కేవలం నాంది"

అతను కొంచెం ఆలోచించి "చెప్పను. ఊహుఁ" అన్నాడు.

"రహస్యమా ?"

"కావచ్చు"

ఆమె వెంటనే మాట్లాడకపోయేసరికి తనే "ఈ విష యంలో ఎక్కువ వొత్తిడి చేయడం నీకే క్షేమం కాదు" అన్నాడు.

"పర్వాలేదు. నన్ను పెళ్ళిచేసుకోవటం యిష్టం లేక పోయిందా ?" శకుంతల మార్దవంగా అడిగింది.

"నాకు యిష్టంలేని సంగతుల్ని నా నోటిగుండా వినాలని ఎందుకు కుతూహలపడతావు ? అది ఎక్కువ సబబైన పనికాదు"

"చెప్పు. పరవాలేదు"

"ఇష్టం లేకపోయింది"

"ఈ విషయం ఆనాడే ఎందుకు చెప్పలేదు? పారిపో వాల్సినంత యిది ఏమొచ్చింది?"

"చెప్పలేకపోయాను"

"సరే" అని ఆమె కొంచంఆగి మెల్లగా "ఆశ్చర్యంగా వుంది. ఒకనాడు నన్ను ఏకాంతంగా కలుసుకుని 'నేను నిన్నే పెళ్ళి చేసుకుంటాను' అన్నావు గుర్తుందా ? నాన్నతో కూడా నీకు ఇష్టమేనని చెప్పావు. అదంతా అలా ఎందుకు జరిగింది?" అని అడిగింది.

"అది వేరే విషయం"

"కాదు—" శకుంతల కటువుగా అంది.

సూర్యారావు ఏదోచెప్పాలన్నంత ఉద్రిక్తతవొచ్చినా నిల్రదొక్కుకొంటూ "లాభంలేదు. ఆ సంగతులు ఏమడిగినా జవాబు చెప్పను" అన్నాడు.

మళ్ళీ తనే "ఇదేనా అడగవలసింది? అయితే వెళ్ళిపోతాను. ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?" అన్నాడు.

"చూడకపోతే ఏమీ అనుకోరుగా"

"అది సరియైన జవాబు కాదు"

"బావా" అంది శకుంతల కంపిత స్వరంతో, "జరిగిపోయిందేదో జరిగిపోయింది. నేను నీ దగ్గరకు వచ్చినందుకు కారణం వేరు."

"సూటిగా అడుగుతున్నాను. సీతను పెళ్ళిచేసుకోవా?"

సూర్యారావు చకితుడయ్యాడు.

"అవును, సీతను పెళ్ళిచేసుకునేందుకు నువ్వెందుకు తటపటాయిస్తున్నావు?"

దీనికి సమాధానం ఏమని చెబుతాడు? అయినా ఆమె ఇంత సూటిగా అడుగుతుందని అతను భావించలేదు.

"కారణం ఏమీలేదు. ఇష్టంలేక"

"ఎందుకు యిష్టంలేదు"

సూర్యారావు మాట్లాడలేకపోయాడు.

"అందంగా వుండదా?"

"శకుంతలకన్న సీత బాగానే వుంటుంది" అని మనస్సులో అనుకున్నాడు.

"మాట్లాడవేం?"

"అదేదీ కాదు"

"ఇంకేమిటి?"

ఈ వాతావరణం ఏమీ అతనికి బాగుండలేదు. ఒకరి మొహం యింకొకరికి కనబడని ఈ చీకటిలో ఎదురెదురుగా నిల్చుని యీ వాగ్వివాదాలు ఏమిటి?

"నన్ను చంపకు - వెళ్ళిపోతాను"

అతను జవాబుకోసం ఎదురు చూడకుండా అక్కడి నుంచి వచ్చివేయబోయాడు. రెండుమూడు అడుగులు వేశాడు కాని....తృళ్ళిపడ్డాడు. ఆమె అతని చేతిని గట్టిగా పట్టుకొని "జవాబు చెప్పందే యిక్కడ్నుంచి కదలటానికి వీలులేదు" అంది దృఢంగా.

నిర్విణ్ణుడై "ఏమిటి యీ సాహసం! ఈ యింట్లో నన్ను వుండనీయవా ఏం?" అన్నాడు.

ఆమె చప్పున అతని చేయి వొదిలేసి "ఇక్కడ చిర కాలం వుండమని ప్రాధేయపడుతున్నాను" అంది.

ఒకటి రెండు నిమిషాలు అతను మౌనంగా నిలబడ్డాడు. తరువాత ఏదో నిశ్చయించుకుని "అసలు యీ విషయంలో యింత పట్టుదల ఎందుకు కలిగిందో చెప్పు" అని తాపీగా అన్నాడు. ఆమె చెప్పబోయేది జాగ్రత్తగా వినదల్చుకునే అన్నాడు.

"చెప్పనా?"

"ఊఁ"

వొణుకుతున్న కంఠస్వరంతో శకుంతల అంది. "సిగ్గు విడిచి చెబుతున్నాను. నాలుగేళ్ళ క్రితం అన్న అనుకున్నట్లు జరిగివుంటే మనమిద్దరం భార్యాభర్తలం కావలసింది. కాని దైవం వేరే వున్నాడు. నువ్వలాపోయావు. నే నిలాఅయాను."

కొంచం విరామంతో తిరిగి గాద్గదికంగా "నీకు తెలీదు గాని యీ ఇంట్లో నీకు చాలా గౌరవంవుంది. నిన్ను పరాయి చోటికి పోనివ్వటం ఎవరికీ యిష్టం లేదు. నువ్వు నా మరిదివి అయితే యింక ఎక్కడికి పోతావు?" అంది.

సూర్యారావు చలించకుండా "నీకు కూడా నేనంటే గౌరవం వుందా?" అన్నాడు.

"నన్ను గాకుండా యీ యింట్లో ఎవరిని అడిగినా సమాధానం చెబుతారీ ప్రశ్నకు"

"నువ్వు నన్ను ఎప్పుడైనా ప్రేమించావా?"

ఆమె తెల్లబోతూ "ఈ సమయంలో అది చాలా అనవసర ప్రసంగం" అంది.

అతను కోపంతో మండిపడుతూ "ఇంతవరకూ నీవు చేసింది అవసర ప్రసంగమా? నీకు సిగ్గులేదూ? ఈ అర్ధరాత్రి పూట వచ్చి మొగాడితో మాట్లాడేందుకు. ఉండు నీ ప్రశ్నకు సమాధానం విని మరీ వెళ్ళు. ఎందుకయితే ఆనాడు పారిపోయానో ఆ కారణం చేతనే యిప్పుడు సీతను చేసుకునేందుకు యిష్టపడటం లేదు" అని అరిచాడు.

మొదట ఆమె అతనికి జవాబు చెప్పకూడదనుకుంది. కాని యీ చివరి వాక్యంవిని, వళ్ళు తెలియని ఆవేశంతో "ఏమిటి మహా చెప్పు?" అంది.

"చెబుతాను. చెప్పవలసిన సమయం ఇప్పుడు వచ్చింది. నువ్వు మంచిదానివి కాదు"

"అంటే?"

"ఇంకా విపులంగా చెప్పాలా ! నీ మొహం ముందు నా నోటి గుండా వినవల్సిన దుర్దశ పట్టినందుకు చింతించు. ఆ రోజుని నా జన్మలో మరిచిపోను. నా కళ్ళారా చూశాను"

"ఏమిటి ?" శకుంతల భయంతోనూ, దుఃఖంతోను కంపించ సాగింది.

"గోవిందం...."

ఆ మాట అసంపూర్తిగానే వుంచి అతను "ఏ మాయ మాటలూ చెప్పి నన్ను బుకాయించలేవు. మీరందరూ నా కంట గడదామను కుంటున్న పిల్ల నీ చెల్లెలు కాదా?" అన్నాడు గబగబ.

ఆమె జవాబు చెప్పకుండా వెక్కి వెక్కి ఏడవటం అతనికి వినిపించింది. "అంతే, ఏడవాలి" అనుకున్నాడు.

"నువ్వు దీనికి ఏమయినా జవాబు చెప్పగలవా?"

సిగ్గు, అభిమానం, దుఃఖం కూడిన కంఠంతో ఆమె "నువ్వు యిందుకు పారిపోయావని యిప్పుడు తెలిసింది. మీ రెవరూ క్షమించరాని తప్పు చేశాను. అదంతా చిన్నతనం...." అని యింకా ఏదో చెప్పబోయింది.

"చిన్నతనం !" సూర్యారావు వెటకారంగా అన్నాడు.

"నువ్వు నన్ను ఆక్షేపించవద్దు బావా ! నన్ను క్షమించమని ఎవరినీ ప్రాధేయపడటల్లేదు. లోకంలో క్షమాపణలు లేని తప్పులలో ఒకటి. కాని నేను సిగ్గులేకుండా నీముందు నిల్చుని వున్నానంటే కారణం ఏమిటో తెలుసా ?"

"మనం యిహ విడిపోదాం, ఎందుకు కబుర్లు, పరిస్థితి యింత విషమించాక కూడా"

"కాదు, నువ్వు వినాలి. నేను చేసింది మహాపరాధం అవటంవల్ల నే యీ పాపఫలం అనుభవిస్తున్నానేమో. కాని నాగురించి మిగతా వారికికూడా అన్యాయం జరగనియ్యమంటావా ?"

సూర్యారావు మాట్లాడకుండా త్వరపడసాగాడు.

శకుంతల "ఇది విను బావా! శకుంతల చేసింది ఎటువంటి అసహ్యకరమైన పని అయినా, అదంతా పరిస్థితుల ప్రభావం అనీ, నీమీద ఆమెకు అగౌరవం ఎంతమాత్రమూ లేదని గుర్తించు. నిన్ను ఎంతో గౌరవించింది. ఆ గౌరవాన్ని నిలబెట్టుకునేందుకు తన చెల్లెలిని పెళ్ళి చేసుకొమ్మని ప్రాధేయ పడుతోంది" అంది నిర్వికారంగా.

"మనం మళ్ళీ మొదటికి వస్తున్నాం"

"లేదు. నీ సంశయం అర్థం అయింది. సీత చాలా మంచిది"

"నువ్వు చెబుతున్నావా ?"

ఆమె బాధతో "అవును. మనస్ఫూర్తిగా చెబుతున్నాను. దానిలో ఎటువంటి కల్మషమూ లేదు. ఎంత పెంకిదో అంత అమాయకురాలు" అంది.

"నిదర్శనం?"

"చెడును నిరూపించటానికి నిదర్శనాలూ, రుజువులూ చాలా లభిస్తాయిగాని, మంచిని నిరూపించటం క్రియద్వారా కష్టం బావా! అది కేవలం తెలివితేటలమీదా, అనుభవం మీదా వ్యక్తం అవుతుంది"

"నీ మాటల్ని నమ్మేదా ?"

"ఎందుకు నమ్మవు ?"

"ఎందుకు నమ్మాలి?" మళ్ళీ వెటకారంగా అన్నాడు.

ఆకస్మికంగా కలిగిన క్రోధావేశాలలో ఆమె వెను వెంటనే నోరు కదల్చలేకపోయింది. తరువాత బుసకొడుతూ "ఈ స్థితిలోవున్న ఆడది ఎప్పుడైనా అబద్ధం చెబుతుందా? మూర్ఖుడా! పోపో! నా కళ్ళముందు వుండవద్దు" అని అరిచింది.

నిరుత్తరుడై అతను ఒక క్షణం అచేతనుడై నిలబడి పోయాడు. తరువాత మెల్లగా తెలివి తెచ్చుకుని ఆమెను సమీపించి "నన్ను క్షమించమని అడుగుతున్నాను" అన్నాడు.

"ఏమిటి?" ఆమె విస్మయపూర్వకంగా అంది.

"నేను సీతను పెళ్ళిచేసుకుంటాను"

"కృతజ్ఞురాలిని" అంటూ ఆమె యింకా అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయింది. సూర్యారావు నిట్టూర్చి చుట్టూరా కలయజూశాడు. చీకటి.

తడుముకుంటూ మెల్లగా నడిచి గదిలోకి వెళ్ళాడు. మంచంమీద కూర్చుని "ఏం జరిగింది?" అని ప్రశ్నించుకున్నాడు.

అతని మనస్సంతా సంక్షోభంతో నిండిపోయింది. ఎటువంటి వింత రాత్రి, ఎటువంటి అనుభూతులు!

చప్పున తెల్లవారితే బాగుండును. చప్పున సూర్యుడు ఉదయిస్తే బాగుండును.

ఈ రాత్రి యిహ తనకు ఎలా నిద్రపడుతుంది? విచిత్రమైన ఆలోచనలతో సతమతమౌతూ గడపాలసిందేనా?

అలాగే పడుకుందామని ప్రయత్నించేటంతలో గదంతా ఒక్కసారిగా వెల్తురులో నిండిపోయింది. అదేమిటి? అతను

నివ్వెరపోయి ద్వారంవైపు చూశాడు. చేతిలో దీపం పుచ్చుకుని అక్కడ సీత నిలబడి అతనివంక చూస్తోంది.

"సీతా !" అన్నాడు పొడిగా.

చేతిలోని దీపం నేలమీద పెట్టి, ఇంకా అతని నేత్ర ద్వయంలోకి సూటిగా చూస్తూ "మనోరమ ఎవరు?" అనడిగింది.

సూర్యారావు తెల్లబోయాడు.

"పద్మ ఎవరు ?"

"............"

"రాగిణి ఎవరు ?"

సూర్యారావు కష్టంమీద తెలివి తెచ్చుకుని, ఆమె వంక చూడటానికి భయపడి "ఈ రాత్రివేళ యిదంతా ఏమిటి సీతా ?"అన్నాడు. తలఎత్తకుండా.

"ఈ రాత్రి యింకా చాలా జరిగాయిగా."

అతనేం మాట్లాడుతాడు ?

"నీ సూట్‌కేసును నువ్వు యింట్లో లేనప్పుడు తెరిచి ఫొటోల అల్బమ్. ఉత్తరాలూ చూసినందుకు నిన్ను నేను క్షమాపణ అడగవల్సిన పనిలేదు అలా అయితే అక్కయ్య విషయంలో నువ్వు చేసిన పనికి దానికి క్షమాపణ చెప్పుకో వాల్సి వుంది" సీత చలించకుండా అంది.

సూర్యారావు తెగించి, తలఎత్తి "అయితే యింతకీ నా దగ్గర్నుంచి నీకు కావలసింది ఏమిటి?" అనడిగాడు.

"మనోరమ విషయం నిజమేనా?"

అతను మళ్ళీ తలవొంచుకొని "ఊఁ" అని గొణిగాడు.

"మీ యిద్దరూ కలిసి తీయించుకున్న ఫొటోనే అందుకు సాక్ష్యం. రాగిణీ!"

"అన్నీ నిజమే"

"పాపం పద్మని ఎందుకు మోసంచేశావు?"

"ఆమెను పెళ్ళిచేసుకుందామని నే నెన్నడూ అనుకో లేదు. ఆమే భ్రమపడి అలా అనుకుంది" అన్నాడు సూర్యారావు దీనంగా.

"ఈనాలుగేళ్ళా దేశాలు తిరిగి చేసిన ఘనకార్యాలు యివేనా?" కటువుగా అంది సీత.

"నేను కావాలని ఏమీ చేయలేదు."

"చిన్నతనమా?" వెటకారంగా అంది.

అతను అదిరిపడి ఆమె కళ్ళలోకి చూశాడు. ఏమయినా భావాలు దొరుకుతాయనే పిచ్చినమ్మకంతో. అతను చూడలేదుగాని, మనసులో ఏదో స్ఫురించి "నువ్విలా ఎందుకడుగుతున్నావో నా కర్థమయింది. మా మాటలన్నీ చాటుగా విన్నావా?"

"నువ్వు నేర్పిన విద్యే"

దెబ్బమీద దెబ్బగా యిలా వరుసగా తగలటం చూసి అతను "నిజమే. నేను దేశాలు తిరిగి పాడయిపోయాను" అన్నాడు ఖేదంగా.

ఆమె మాట్లాడకుండా అతనివంక చూస్తోంది.

ఆమెను సమీపించి చిన్నగా "నిన్ను పెళ్ళిచేసుకునే అర్హత లేదు. నీకు సమాధానం దొరికిందా?" అని సిగ్గుతో

"నాకళ్ళు తెరిచావు. నే నింత పతితుడ్ననీ, ఎవరినీ పెళ్ళి చేసుకునేందుకూ అర్హతలూ, యోగ్యతలూ,నాకు లేవని బోధపడింది. నన్ను పెళ్ళి చేసుకోకు. నాకంటే మంచివాడు.... ...." బాధతో అతని గొంతు పూడుబడింది.

సీత నిశ్చలంగా "కాని నిన్ను నేను పెళ్ళిచేసుకుంటాను" అంది.

అతను తెల్లబోయి ఆమెకేసి ఆత్రంగా చూశాడు.

"అవును"

"ఎందుకు కక్కుర్తి పడతావు? నేను మంచివాణ్ని కాను."

"ఫర్వాలేదు" ఆమె అంది. "మీలో లోపించిన శ్రమ, విశాల భావాలూ మాలో వున్నాయి. ఏమాత్రం కలత చెందకుండా నిన్ను నేను భర్తగా స్వీకరించగలను"

అతను అర్ధ్రనేత్రాలతో ఆమెవంక చూస్తూ "సీతా!" అన్నాడు. "నీ విషయంలో నేను హామీ యిస్తున్నాను. నా విషయంలో అక్కయ్య చెప్పినదాన్ని గురించి ఋజువు పర్చుకోనటానికి నాకేం అవసరం లేదు. బాగా ఆలోచించుకుని ఏదో నిశ్చయానికి రా" అని అక్కడినుంచి వెళ్ళిపోబోతూ "ఒక్క విషయంమటుకు నీకు చెబుదామనుకున్నాను. ఈరాత్రి నేను చాలా క్రొత్తవిషయాలు విన్నా. అక్కయ్యంటే నాకేమాత్రం ఏహ్యత కలగలేదు. ఆమెమీద వున్న గౌరవం యినుమడించింది" అని చకచక నడిచి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవంకే భావశూన్యంగా కొంతసేపు చూసి, తరువాత నెమ్మదిగా కిటికీదగ్గరకు వచ్చి తూర్పుదెస చూశాడు.

ఇంకా తెల్లవారలేదు. సూర్యుడు రాలేదు.

కాని అతని మనసులో....

అందుకు కేవలం వ్యతిరేకంగా జరిగింది.

— o —